క్లుప్తంగా

భక్తుల సేవలో..



భక్తులకు బెల్లం పానకం పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ దామోదరరావు

చీపురుపల్లి: శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా ఆటో స్టాండ్‌లో శ్రీనివాసా గోవిందా ఆటోసేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం బెల్లం పానకం, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌ఐ ఎల్.దామోదరరావు ప్రారంభించారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పందూరి తాతాజీ, సంఘ సభ్యులు సూర్యనారాయణ, సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడపేటలో నేత్ర వైద్యశిబిరం



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: కొవ్వాడపేటలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల వద్ద విజ యనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన 50 మందికి ఆప్తాలమిక్ సురేష్ నేత్రపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టాస్‌వేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని డీఎఫ్ఎన్ ప్రాంతానికి చెందిన యువకులు చంటి,కరుణ, పైడిరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారి స్మారకార్థం డీఎఫ్ఎస్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రాధిక మెటల్స్ అండ్ మినరల్స్ సంస్థ సౌజన్యంతో నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్‌ను రాధిక మెటల్స్ అండ్ మినరల్స్ సంస్థ ప్రతినిధి సత్యనారాయణ,స్థానిక ప్రజాప్రతినిధులు నేతేటి కృష్ణవేణి, తోట రవి, వాల్లె చిట్టియ్య, జోగినాయుడు ప్రారంభించారు. టోర్నమెంట్‌లో చీపురుపల్లి,గరివిడి,గుర్ల మండలాల నుంచి 50 జట్లు పాల్గొంటున్నాయని, మూడు వారాల పాటు టోర్నమెంట్ జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

తుప్పలు తొలగించరూ...



శ్మశాన వాటికలోకి వెళ్లే దారిలో ఏపుగా పెరిగిన తుప్పలు

గజపతినగరం రూరల్: మండలంలోని పిడిశీల గ్రామ శ్మశానవాటికలో తుప్పలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాలను శ్మశాన వాటికలోకి తీసుకువెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటిక ముఖద్వారం వద్ద తుప్పలు దట్టంగా పెరగడంతో లోపలికి వెళ్లేందుకు దారిలేకుండా పోయింది. చుట్టూ తిరిగి లోపలకు వెళ్లాల్సి వస్తోంది. పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టేందుకు కూడా పంచాయతీలో నిధులు లేవని పంచాయతీ అధికారులు చెబుతున్నారని, ఇది సరికాదని గ్రామస్తులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తుప్పలు, పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆశాజనకంగా రబీ వరిసాగు



లచ్చింపేటలో కోతదశకు చేరుకున్న వరి పంట

లక్కవరపుకోట: మండలంలో రబీ వరిపంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది రబీసీజన్‌లో సుమారు 60 ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. లచ్చింపేట, లక్కవరపుకోట, గొల్జాం, సీతారాంపురం గ్రామాల్లో పంట కోత దశకు చేరుకుంది. గత ప్రభుత్వంలో రైతులకు రైతుభరోసా పథకం పేరిట పెట్టుబడి సాయం అందేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా పథకానికి అన్నదా త సుఖీభవగా ప్రభుత్వం పేరు మార్చింది కానీ గత ఖరీఫ్‌లోనూ రూపాయి పెట్టుబడి సాయం ఇవ్వలేదు. రబీలో కూడా ఇవ్వలేదు. రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.

వైభవంగా.. శ్రీరామ నవమి వేడుకలు

• కనుల పండువగా సీతారాముల కల్యాణం



చీపురుపల్లి: చీపురుపల్లిలోని కస్పావీధి రామమందిరంలో తాళిబొట్టు చూపిస్తున్న పురోహితుడు



కొత్తవలస: మంగళపాలెం రామాలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లో వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అన్ని గ్రామా ల్లోనూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొం ది.రామాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. జై శ్రీరామ్...జై శ్రీరామ్ అన్న రామనామస్మరణతో రామాలయాలు మార్మోగాయి. పూజల అనం తరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి కల్యాణ వేదికలపై అధిరోహింపజేశారు. సీతమ్మవారికి భక్తులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా సారె తీసుకుని రాగా... వేద పండితులు కనుల పండువగా సీతారాముల కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. మధ్యాహ్నం రామాలయాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



వేపాడ: వేపాడ రామాలయంలో సీతారాముల కల్యాణం



కొత్తవలస: మంగళపాలెంలో సీతాదేవికి సారె తీసుకువస్తున్న మహిళలు



లక్కవరపుకోట: శ్రీరాంపురంలో కల్యాణ వేదిక వద్దకు సీతమ్మను తీసుకువస్తున్న భక్తులు



చీపురుపల్లి: చీపురుపల్లిలోని కస్పావీధి రామమందిరంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దంపతులు



కొత్తవలస: కొత్తసుంకరపాలెం రామాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



లక్కవరపుకోట: ఖాసాపేటలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు



బొండపల్లి: గరుడుబిల్లిలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న గ్రామపెద్దలు



గజపతినగరం: గజపతినగరం రామాలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



చీపురుపల్లి: వంగపల్లిపేటలో సీతారాముల ఊరేగింపు



చీపురుపల్లి: చీపురుపల్లిలోని తెగిడివీధి రామాలయంలో సీతమ్మకు పాతకుమ్మరివీధి వాసులతో సారె తీసుకువెళుతున్న జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు



గుర్ల: గుర్లలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను మోస్తున్న జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి



దత్తిరాజేరు: ఎస్.చింతలవలసలో రాములోరి కల్యాణం



వేపాడ: బొద్దాంలో సీతారాముల కల్యాణ మహోత్సవం



వేపాడ: బల్లంకిలో పూజలు చేస్తున్న భక్తులు



శృంగవరపుకోట: ఎస్.కోటలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

ముగిసిన రామాలయ ప్రతిష్టోత్సవాలు



ఆలయ ప్రతిష్టోత్సవాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: భూపాలరాజపురంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రామాలయ ప్రతిష్టోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేద పండితులు రేజేటి రామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి సీతారామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సీతారాములను మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరస య్య, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పల నాయుడు దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షల విరాళం

రామాలయానికి వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ రూ.3 లక్షలు విరాళం అందజేశారు. నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

వైద్యసిబ్బందికి సేవారత్న పురస్కారాలు



హెల్త్ అసిస్టెంట్ సత్యారావును సత్కరిస్తున్న మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ సంస్థ, గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు

కొత్తవలస: విజయవాడకు చెందిన మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ సంస్థ, గ్లోబల్ ఫౌండేషన్ వారు మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రి నాయుడు,హెల్త్ అసిస్టెంట్ సత్యారావుకు సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడలోని అలంకార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి, హెల్త్ అసిస్టెంట్‌ను నిర్వాహకులు సత్కరించి, అవార్డులు అందజేశారు. వైద్యాధికారి సింహాద్రి నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలం దించడం, కోవిడ్ సమయంలో కరోనా నిర్ధారణ పరీక్షలు చేయడం, కోవిడ్ వ్యాక్సినేషన్, డెంగ్యూ, మలేరియా,టీబీ,లెప్రసీ వ్యాధులపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించినందుకు ఈ అవార్డులు అందజేశారని తెలిపారు. అవార్డు గ్రహీతలకు ఆస్పత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

కొత్తవలసకు చేరిన ఇస్కాన్ యాత్ర



భగవద్గీత, కృష్ణతత్వంపై అవగాహన కల్పిస్తున్న ఇస్కాన్ సభ్యులు

కొత్తవలస: అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం, ఇస్కాన్ వారి సంపూర్ణ భారతదేశ పాద యాత్ర ఆదివారం కొత్తవలస చేరుకుంది. ఆచార్య ప్రభూజీ ఆధ్వర్యంలో సనాతన ధర్మం, వైదిక సంప్రదాయంపై ప్రచారం చేస్తూ ఈ పాదయాత్ర సాగుతోంది. ఈసందర్భంగా ప్రభూజీ మాట్లాడుతూ 1984లో ఈపాదయాత్రను ప్రారంభించామని, ఇప్పటికి అరు పర్యాయాలు సంపూర్ణ భారతదేశం పర్యటించామన్నారు. ప్రస్తుతం ఏడో పర్యాయం యాత్ర గుజరాత్ రాష్ట్రంలోని ద్వారకాలో ప్రారంభించామని తెలిపారు. కేదార్‌నాథ్, బద్రీనాథ్, అయోధ్య, మాయాపూర్, జగన్నాథపురి, శ్రీకూర్మం, సింహాచలం, మంగళగిరి, తిరుపతి, రామేశ్వరం మీదుగా కన్యాకుమారి వరకు పాదయాత్ర చేయనున్నట్లు చెప్పారు. ఎడ్ల బండిపై శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలను ఉంచి, ఆరథం వెనుక 18 మంది భక్తులతో రోజుకు 10 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు హిందూ సంస్కృతీ, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామని, భగవద్గీత, కృష్ణతత్వంపై ప్రచారం చేస్తున్నామని చెప్పారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

చీపురుపల్లి: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గరివిడి మండల కేంద్రం నుంచి ద్విచక్ర వాహనాలతో చీపురుపల్లిలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ వ్యవస్థాపకులు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ, పార్లమెంటరీ కన్వీనర్ శంభర లక్ష్మీనర్సింహం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో దేశ ప్రతిష్ట పెరిగిందన్నారు. చీపురుపల్లి మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కింతాడ ప్రదీప్‌కుమార్, బీజేపీ గరివిడి, గుర్ల మండలాల అధ్యక్షులు త్రినాథ్‌రామ్, పోలిపల్లా కనకరాజు, గుర్ల మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఆర్టీఐ సెల్ కన్వీనర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంలో ముగిసిన 'ఆండ్రాయిడ్' వర్క్‌షాప్

విజయనగరం అర్బన్: గాజులరేగలో ఉన్న సీతం ఇంజనీరింగ్ కళాశాలలో 'ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలమెంట్' అనే అంశంపై వారం రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త నిర్వహణలో కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎంసీఏ విద్యార్థుల కోసం ఈ వర్క్‌షాప్ చేపట్టామని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. కోడింగ్ కాంపిటేషన్‌లో పాల్గొనే విధంగా చేసి వారిలో ఆసక్తి పెంపొందించారు. చివరి రోజున పోటీ కోడింగ్ వర్క్‌షాప్ గురించి విద్యార్థులు తమ అభిప్రాయాలు, అనుభవాలను పంచుకున్నారు.

సిరిమాను తరలింపు

బొబ్బిలి: మండలంలోని గొల్లపల్లిలో దాడితల్లి సిరిమానోత్సవానికి సంబంధించి, సిరిమాను తయారీకి కృష్ణాపురంలో గుర్తించిన సిరిమాను చెట్టును గ్రామానికి ఆదివారం తరలించారు. మే 4, 5, 6వ తేదీల్లో దాడితల్లి అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మే 5వ తేదీన జరిగే సిరిమానోత్సవానికి సిరిమాను తయారు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మండల జనార్ధనరావు, వి.రవికుమార్, సాయిహేమంత్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సిరిమానును తరలిస్తున్న భక్తులు

అధ్వానంగా ముకుందపురం రోడ్డు



గోతులు తేలిన రోడ్డు

వేపాడ: మండలంలోని బొద్దాం జంక్షన్ నుంచి ముకుందపురం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు 4 కిలోమీటర్లు ఉండే ఈరోడ్డులో ఎక్కడికక్కడ గోతులు తేలడంతో రాక పోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనచోదకులు గోతుల్లో అదుపుతప్పి పడిపోతున్నారని, అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ముకుందపురం గ్రామస్తులు కోరుతున్నారు.

11తో ముగియనున్న గడువు..

• కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



లక్కవరపుకోట కేజీబీవీ

కొత్తవలస: కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు కొద్ది రోజుల కిందట ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఆరో తరగతి, ప్రథమ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలతో పాటు 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నామని, విద్యార్థినులు ఈనెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు తెలిపారు. టీటీపీఎస్://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కేజీబీవీలను సంప్రదించాలన్నారు.

కేజీబీవీల్లో సీట్ల వివరాలు

జిల్లాలోని 26 కేజీబీవీల్లో 7,248 సీట్లు ఉన్నట్లు సమాచారం. 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో 1040 సీట్లు.. ప్రథమ ఇంటర్మీడియట్‌లో 1040 సీట్లు భర్తీ చేయనున్నారు. అలాగే 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీలను కూడా భర్తీ చేస్తారు. అనాథలు, సింగిల్ పేరెంట్, బడి బయట ఉన్న చిన్నారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలచే సీట్లు భర్తీ చేస్తారు.